ప్రజాశక్తి
బుధవారం 12 మార్చి 2025
5
విజయనగరం

నిరక్షరాస్యులైన వయోజనులకు 23న పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం కింద నమోదైన నిరక్షరాస్యులైన వయోజనులకు ఈనెల 23న 3 గంటల పాటు పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు జరుగుతుందని, ఈమధ్యలో ఏ 3 గంటలైనా అభ్యర్థులు పరీక్షను రాయవచ్చునని తెలిపారు. జిల్లాలో సుమారు 48వేల మంది ఈ పరీక్ష రాయనున్నారని, అందుకోసం 875 పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్లో ఉల్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లుగా జవాబు పత్రాన్ని మూల్యాంకనం చేసేందుకు అర్హత కలిగిన అంగన్వాడీ టీచర్లను నియమించాలని తెలిపారు. పరిశీలకులుగా వెలుగు ఎపిఎంలను నియమించాలన్నారు. సమావేశంలో వయోజన విద్య డి.డి. సోమేశ్వర రావు, ఐసిడిఎస్ ఇన్ఛార్జి పీడీ ప్రసన్న, డిఆర్డిఎ ఎపిడి సావిత్రి, వయోజన విద్యాశాఖ ఎపిఒ ధనలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తింపు పేరిట వివక్ష

పెట్టుబడి సాయం ఎగ్గొట్టేందుకు కుట్ర
ఆందోళనలో ఆర్ఒఎఫ్ఆర్, డి-పట్టాదారులు, కౌలు రైతులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గుర్తింపు పేరుతో రైతులకు శఠగోపం పెట్టేందుకు, వారి మధ్య అంతరాలు సృష్టించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయా? అంటే రైతు సంఘాలు, వ్యవసాయ రంగంపై అవగాహన కలిగిన రైతుల నోట ఔను..! అనే సమాధానం వినిపిస్తోంది. ఎపి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పేరిట గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ నెంబర్, పేరు ఆధారంగా సొంత భూమి ఉన్న రైతులను గుర్తిస్తున్న సంగతి తెలిసిందే. గత నెల 10వ తేదీ నుంచి జిల్లాలో ఈ కార్యక్రమం మొదలైంది. ఇందులో కేవలం సొంత భూమి ఉన్నవారికి మాత్రమే గుర్తింపు లభిస్తోంది. అటవీహక్కుల చట్టం ప్రకారం పొందిన ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు, డి-పట్టాలు, కౌలు రైతులకు గుర్తింపు లేదు. ఇటువంటివారి వివరాలను ప్రభుత్వం రూపొందించిన వెబ్-సైట్ స్వీకరించడం లేదు. దీంతో, ఆయా రైతుల్లో ఆందోళన మొదలైంది. కేంద్ర అందిస్తున్న పిఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పెట్టుబడి సాయం భారాన్ని తగ్గించుకునేందుకే ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న అనుమానాలు ఊపందుకున్నాయి. మన జిల్లాలో రైతుల సంఖ్య 2.80లక్షల మంది ఉన్నట్టు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో ఇప్పటి వరకు రైతు సేవాకేంద్రాల్లో 19,9,599 మంది రైతులు గుర్తింపు పొందినట్టు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. మిగిలిన రైతుల కూడా కేంద్రాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరుతున్నారు. అప్పటికీ మిగిలిపోతే రైతుల ఇళ్లకు వెళ్లి వారి గుర్తింపు నమోదు చేయాలని కూడా ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నాయి. కానీ, అందరి రైతులనూ ఎందుకు గుర్తించడం లేదన్నది రైతులు, రైతు సంఘాల వాదన. జిల్లాలో ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు, డి-పట్టాలు, డికెటి -పట్టా కౌలు రైతుల గుర్తింపు కార్డులను సర్కారు వారి వెబ్సైట్ పరిగణలోకి తీసుకోవడం లేదు. ఇక అనధికారికంగా పొండపోరం బోకు తదితర పేర్లతోవున్న ప్రభుత్వ భూముల్లోనూ ఎంతో మంది వివిధ పంటలు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో చాలా మంది అడంగల్లో గుర్తింపబడి కూడా ఉంటారు. ఇవేవీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం లేదు. దీంతో, ఆయా పట్టాలు, పత్రాలకు కంప్యూటర్లో ఆప్షన్ ఇవ్వలేదంటూ రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు తేల్చి చెబుతున్నారు. దీన్నిబట్టి జిరాయితీ భూమి ఉన్న రైతు లు, డి-పట్టా, ఆర్ఒ ఎఫ్ఆర్ పట్టాదారులు మధ్య ప్రభు త్వం వివక్ష చూపు తోందని స్పష్టమౌతోంది.

ఇక కౌలు దారుల విషయా నికి వస్తే.... మన జిల్లాలో పెద్ద రైతుల భూములు సాగుచేసిన వారు, ఇనాం, దేవాదాయ తదితర భూము లు సాగుచేస్తున్న కౌలు రైతులు సుమారు లక్ష మంది వరకు ఉన్నారని రైతు సంఘం అంచనా. ప్రభుత్వం మాత్రం ఏటా 16,500 మందికి మించి కౌలు గుర్తింపు కార్డులు జారీచేయడం లేదు. ఈ ఏడాది కూడా 16,243 మందికి మాత్రమే గుర్తింపు కార్డులు ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెబ్సైట్లో నమోదుకు అసలు అవకాశమే కల్పించకపోవడంతో వీరుకూడా గుర్తింపునకు నోచుకునే అవకాశం లేదు. దీన్నిబట్టి పిఎం కిసాన్ పేరిట కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన పెట్టుబడి సాయం ఎగ్గొట్టేందుకే ఈ రైతు గుర్తింపు ప్రక్రియ చేపట్టారని రైతులు, రైతు సంఘం నాయకులు అనుమానిస్తున్నారు. క్రమంగా రైతుల సంఖ్యను తక్కువ చేసి వివిధ రూపాల్లో ఇవాల్సిన సబ్సిడీలను ఎగ్గొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం భారాన్ని తగ్గించుకునేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని తీసుకొచ్చిందేనే చర్చ సాగుతోంది.

భూధార్ ప్రక్రియను నిలిపివేయాలి

ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ఇవ్వకపోవడమే కాకుండా అన్నదాత సుఖీభవ కింద ఇస్తామన్న పెట్టుబడి సాయం కూడా ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తోంది. కౌలు రైతులకు, డి-పట్టాదారులకు రిజిస్ట్రేషన్ లేకుండా చేసింది. వెంటనే వీరికి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే ఆందోళన చేపడతాం.

- బి.రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మున్సిపల్ చైర్మన్పై

అవిశ్వాసానికి రంగం సిద్ధం

- సంతకాలు పెట్టిన 9మంది వైసిపి కౌన్సిలర్లు?
- టిడిపి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూపు
- తూర్పుకాపు సామాజిక వర్గానికి చైర్మన్ పదవి ఇవ్వాలని వైసిపి కౌన్సిలర్ల షరతు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ న సావు వెంకట మురళీకృష్ణపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు టిడిపి, వైసిపి కౌన్సిలర్లు కలసి సిద్ధమైనట్లు చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత స్థానిక సంస్థల పదవులను కైవసం చేసుకునేందుకు శరవేగంగా పావులు కదుపుతున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో బేబినాయన ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో మున్సిపల్ పీఠాన్ని టిడిపి కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీరి ప్రయత్నాలకు వైసిపిలోని అసమ్మతి కౌన్సిలర్లు మద్దతు ఇవ్వడంతో మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు సులభతరమైందని చర్చ జరుగుతోంది. ఇప్పటికే అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ కు ఇచ్చేందుకు తొమ్మిది మంది వైసిపి కౌన్సిలర్లు సంతకాలు పెట్టినట్లు తెలిసింది. ఈ విషయం వైసిపి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుకు తెలియడంతో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, వైసిపి ముఖ్య నాయకులు కలసి వైసిపి కౌన్సిలర్లతో మూడు రోజుల క్రితం సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానంపై ఎటువంటి నిర్ణయమూ తీసుకోవద్దని సూచించారు. అయినా కొంతమంది కౌన్సిలర్లు అంగీకరించలేదని తెలిసింది.

సంతకాలు పెట్టిన 9మంది వైసిపి కౌన్సిలర్లు

మున్సిపాలిటీలో 31 వార్డులు ఉండగా 20 మంది వైసిపి కౌన్సిలర్లు, 10మంది టిడిపి కౌన్సిలర్లు, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఉన్నారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ వాడపల్లి వనజకుమారి వైసిపిలో చేరడంతో వైసిపి కౌన్సిలర్ల సంఖ్య 21కు చేరింది. అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే 20మంది కౌన్సిలర్లు సంతకాలు అవసరం. 10మంది టిడిపి కౌన్సిలర్లు ఉండగా 9మంది వైసిపి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వడంతో 19మంది అవిశ్వాస తీర్మానానికి సిద్ధంగా ఉన్నారు. మరొకరు అవసరం కాగా ఎమ్మెల్యే బేబినాయనకు ఉన్న ఎక్స్ అఫిషియో ఓటుతో అవిశ్వాస తీర్మానం జిల్లా కలెక్టర్ కు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇందుకు టిడిపి అధిష్టానం, ఎమ్మెల్యే బేబినాయన నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో వైసిపి, టిడిపి కౌన్సిలర్లు ఎదరు చూస్తున్నారు.

తూర్పుకాపు సామాజిక వర్గానికి చైర్మన్ పదవి ఇవ్వాలని వైసిపి కౌన్సిలర్ల షరతు

బొబ్బిలి మున్సిపల్ కౌన్సిలర్ గా తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన సావు వెంకట మురళీకృష్ణ ఉన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టి మురళీకృష్ణను దించేసి అదే సామాజిక వర్గానికి చెందిన టిడిపి పట్టణ అధ్యక్షులు, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ రాంబార్కి శరత్ కు ఇవ్వాలని వైసిపి కౌన్సిలర్లు షరతు పెట్టినట్లు తెలుస్తోంది. విజయనగరంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన సమావేశంలో ఇదే విషయాన్ని ఒక కౌన్సిలర్ భర్త ప్రస్తావించినట్లు తెలిసింది.

వైసిపి కౌన్సిలర్ల షరతుతో టిడిపికి తలనొప్పి

తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన రాంబార్కి శరత్ కు చైర్మన్ పదవి ఇవ్వాలని వైసిపి కౌన్సిలర్లు షరతు పెట్టడంతో టిడిపికి తలనొప్పిగా మారినట్లు తెలిసింది. మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి చైర్మన్ అభ్యర్థిగా ఆరో వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావును ప్రకటించడంతో మున్సిపల్ ఎన్నికల ఖర్చంతా ఆయనే భరించారు. ఎన్నికల్లో టిడిపి నుంచి పది మంది మాత్రమే గెలవడంతో ఆయన ప్రస్తుతం ఫ్లోర్ లీడర్గా వ్యవహరిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం పెడితే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించిన గెంబలి శ్రీనివాసరావుకు చైర్మన్ పదవి ఇవ్వాలని టిడిపిలో ఒక గ్రూపు కోరుతున్నట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల నుంచి ఎమ్మెల్యే బేబినాయన బొబ్బిలి వచ్చాక చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటారని చర్చ జరుగుతోంది. అవిశ్వాస తీర్మానం తెరపైకి రావడంతో టిడిపి,వైసిపి పోటాపోటీగా సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. బుధవారం టిడిపి కౌన్సిలర, గురువారం వైసిపి కౌన్సిలర్లు సమావేశం కానున్నట్లు తెలిసింది.

మద్దువలస కుడికాలువలో దూకి

తల్లీపిల్లలు ఆత్మహత్యాయత్నం

- తల్లి, కుమారుడిని కాపాడిన స్థానిక యువకుడు
- గల్లంతైన బాలిక.. ముమ్మరంగా గాలింపు చర్యలు
- ఆర్థిక ఇబ్బందులే కారణం

ప్రజాశక్తి-వంగర

మండలంలోని మద్దువలస కుడి ప్రధాన కాలువలోకి దూకి ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం మధ్యాహ్నం ప్రాజెక్టు ప్రధాన కాలువ హెడ్ స్లూయిస్కు దిగువ భాగంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బలిజిపేట మండలం గంగాడకు చెందిన కళింగ శ్రావణి(30), తన తొమ్మిదేళ్ల కుమారుడు సిద్ధు, ఏడేళ్ల కుమార్తె సైనీతో కలిసి కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసమయంలో అటువైపు చేపల వేటకు వెళ్తున్న సంగాం గ్రామానికి చెందిన జన్ని జగన్మోహన్ అనే యువకుడు వారిని చూసి వెంటనే కాలువలో దూకి శ్రావణిని, బాలుడు సిద్దును కాపాడి ఒడ్డుకు చేర్చాడు. వెంటనే వంగర పోలీసులకు సమాచారమిచ్చాడు. అప్పటికే కాలువలో కొట్టుకుపోయిన బాలికను కాపాడే ప్రయత్నం చేస్తుండగా... ఒడ్డుకు చేర్చిన మహిళ శ్రావణి తన కుమారుడిని తీసుకొని మళ్లీలో నీళ్లలో దూకింది. జగన్మోహన్ మళ్లీ వారిని రక్షించాడు. ఆ ప్రయత్నంలో బాలిక గల్లంతయ్యింది. వీరిని రెండోసారి రక్షించే ప్రయత్నంలో బాలికను రక్షించలేకపోయానని యువకుడు జగన్మోహన్ తెలిపాడు. భారీ లోతు ఉన్న కాలువలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నీళ్లలో దూకి తల్లీ, కుమారుడిని కాపాడిన జగన్మోహన్ను గ్రామస్తులు అభినందించారు.

బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్న మత్స్యకారులు
గల్లంతయిన బాలిక సైనీ (ఇన్సెట్లో)

వంగర మండలం కింజంగి గ్రామానికి చెందిన గుంట తవుడు, కళావతి రెండో కుమార్తె శ్రావణి బలిజిపేట మండలం గంగాడ గ్రామానికి చెందిన కళింగ సుధాకర్ను పదేళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు సిద్ధు, సైనీ పుట్టిన తరువాత సుధాకర్ మానసిక స్థితి కోల్పోయాడు. పైగా వారిద్దరి మధ్య సఖ్యత లేకపోవడంతో శ్రావణి కింజంగి గ్రామంలో ఉన్న తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయి ఐదేళ్లగా ఉంటోంది. కుమారుడు సిద్ధు ఉంగరాడ మెట్టవద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ఐదో తరగతి చదువుతుండగా, సైనీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. మూడు రోజుల క్రితం గరుగుబిల్లి మండలం బురద వెంకటాపురంలోని బంధువుల ఇంటికి పిల్లలతో కలసి వెళ్లిన శ్రావణి తన కుమారుడిని పాఠశాలకు తీసుకెళ్తున్నట్లు బంధువులకు చెప్పి మద్దువలస ప్రధాన కాలువ వద్దకు తీసుకెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆర్థిక సమస్యలు వల్లే ఆత్మహత్యాయత్నం చేసుకొని ఉండవచ్చునని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ధర్మరాజుతో పాటు రాజాం అమ్మవారి జాతరబందోబస్తులో ఉన్న ఎస్ఐ షేక్ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాజెక్టు అధికారులకు సమాచారం ఇచ్చి కాలువ హెడ్ స్లూయిస్ గేట్లు మూసివేయించారు. గత ఈతగాళ్లు, మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో బాలిక ఆచూకీ లభ్యం కాలేదు.

యువకుడు కాపాడడంతో ప్రాణాలతో బయటపడ్డ తల్లి, కుమారుడు

నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు

- సలహాలు, సూచనల స్వీకరణకు 15న సమావేశం : కలెక్టర్
- పాల్గొననున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ఇతర ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర, జిల్లాల సత్వర అభివృద్ధి కోసం స్వర్ణాంధ్ర-2047 పేరుతో దార్శనిక పత్రాన్ని రూపొందించిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ఇప్పుడు అసెంబ్లీ నియోజకవర్గం వారీగా అభివృద్ధి సాధనకు దార్శనిక పత్రాలను రూపొందించాలని సంకల్పించింది. దీనిలో భాగంగా ఆయా నియోజకవర్గాల పరిధిలో అందుబాటులో వున్న వనరులను వినియోగించుకొని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలతో నియోజకవర్గ అభివృద్ధికి దార్శనిక పత్రాలను రూపొందించేందుకు కసరత్తు ప్రారంభించింది. నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికల రూపొందించడంలో భాగంగా జిల్లాలోని మంత్రులు, ఎంపిలు, శాసనసభ్యులు, మండలి సభ్యులు, జెడ్పీ ఛైర్మన్, కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలు

స్వీకరించేందుకు ఈనెల 15న కలెక్టరేట్లో ఉదయం 10.30 గంటలకు ఒక సమావేశం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ అంబేద్కర్ వెల్లడించారు. వీరితోపాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులు, జిల్లా అభివద్ధిలో భాగస్వాములైన అన్ని వర్గాల నుంచి సూచనలు స్వీకరించిన మీదట వీటన్నింటినీ క్రోడీకరించి ఒక సమగ్ర దార్శనిక పత్రాన్ని రూపొందిస్తామని తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 1012 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్, ఒకేషనల్ పరీక్షకు 1012 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 22,398 మంది హాజరు కావాల్సి ఉండగా 21,386 మంది హాజరయ్యారని అర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో సమస్యలపై చర్చలకు ఇసి ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా ఎన్నికల అధికారి, ఇఆర్ఒ లేదా రాష్ట్ర సిఇఒ స్థాయిలో పరిష్కారం కాని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమస్యలపై రాజకీయ పార్టీలతో చర్చించేందుకు సిద్ధంగా వున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు లేదా పార్టీ సీనియర్ నాయకులతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘం అన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి పార్టీలకు లేఖలు రాసినట్టు ఎన్నికల సంఘం డైరెక్టర్ అనిల్ చందక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చలు, సమావేశాలు నిర్వహించి ఈ సందర్భంగా వారు లేవనెత్తిన అంశాలు పరిష్కరించి మార్చి 31లోగా చర్యల నివేదిక సమర్పించాలని కేంద్ర ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ గత వారం రాష్ట్రాల ఎన్నికల సంఘం సిఇఒలు, జిల్లా ఎన్నికల అధికారులు, ఇ.ఆర్.ఓ.లతో నిర్వహించిన ఆన్ లైన్ సమావేశంలో ఆదేశించినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల వారు ఈ అవకాశాలను వినియోగించు కోవాలని కోరారు.

ఈనెల స్కూల్ కాంప్లెక్సులు రద్దు చెయ్యాలి : ఎమ్మెల్సీ

ప్రజాశకి-విజయనగరం టౌన్

పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయం అయిందున ఈ నెల క్లస్టర్ మీటింగులు రద్దు చెయ్యాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం అవుతున్నందున సబ్జెక్టు రివిజన్ చెయ్యడం, ధైర్యం చెప్పడం, విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రతిక్షణం అందుబాటులో ఉండాలని, కనుక క్లస్టర్ మీటింగ్ వలన విద్యార్థులు టీచర్స్ అందుబాటులో లేక మానసికంగా ఇబ్బంది పడతారని తెలిపారు.

నివాసమున్న ఇళ్లను రెగ్యులర్ చేయాలి

సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 30 ప్రకారం పట్టణా ల్లో నివాసం ఉంటున్న ఇళ్లకు 2 సెంట్లు ఉచితంగా రెగ్యులర్ చేసి ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా మంగళవారం 29 వ డివిజన్ రామకృష్ణానగర్, దాసన్నపేటల్లో జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ పేదలకు తెచ్చిన జీవోను పెద్దలు ఉపయోగించు కోకుండా చూడాలని ఆయన కోరారు. పేదలు నివసించే ప్రాంతాల్లో పక్కాగా రెగ్యులర్ చేసి న్యాయం చేయాలని కోరారు. గతంలో 116 జీవోలాగే దీన్ని నీరుకార్చకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రామకృష్ణానగర్తో పాటు ఉన్న అనేక కాలనీల్లో ఈ ఇళ్ల రెగ్యులర్ సమస్యలు ఉన్నాయని, వాటినన్నిటినీ పరిష్కరించాలని కోరారు. గంజిపేటలో 50 ఏళు గా నివాసం ఉంటున్న పేదలకు , ధలితులు ఇళ్లు రెగ్యులర్ చేయాలని, కుళాయి కనెక్షన్లు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ కోరారు. గొడగల వీధిలో గిరిజన పేదలు నివాసం ఉంటున్న చోట రెగ్యులర్ చేయాలని సిపిఎం నగర కమిటీ సభ్యులు బి. రమణ కోరారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. జగదాంబ పాల్గొన్నారు.

విజయనగరంలో : దాసన్నపేటలో స్థానికులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కుంటినవలసలో ప్రజా చైతన్య యాత్ర

మెంటాడ : మండలంలోని లోతుగెడ్డ, కుంటినవలసలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ పార్టీ నాయకులు జి.శ్రీనివాస్, రాకోటి రాములు ఆయా గ్రామాల్లో సమస్యలను తెలుసుకున్నారు. ఇంటింటికి మంచినీళ్ల కుళాయిలు కావాలని, గ్రామంలో నివసిస్తున్న దళితులకు శ్మశానానికి కేటాయించిన 70 సెంట్లు వాళ్ళ ఆధీనంలోకి ఇవ్వాలని, శ్మశానానికి సీసీ రోడ్డు, మంచినీటి సౌకర్యం కల్పించాలని, ఎస్సి కాలనీకి ఆనుకొని ఉన్న చెరువుగట్టు ర్యాంప్ ను ఎత్తు చేయాలని సిపిఎం బృందానికి ప్రజలు విన్నవించారు. ఈ సందర్భంగా జి.శ్రీనివాస్, పార్టీ సభ్యులు లింగాల వెంకట్రావు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకనే ప్రజా సమస్యలు తెలుసుకుని వారికి చైతన్యపరిచి సమస్యల పరిష్కారం కోసం స్థానిక అధికారులకు వినతి పత్రాల సమర్పిస్తామని చెప్పారు. చాకలి కృష్ణ, జంగం అప్పన్న, లింగాల అప్పారావు, చాకలి అప్పారావు, జంగం గౌరీ, శంకర్, ఎర్రి నాయుడు, లింగాల గౌరమ్మ, పైల సన్యాసమ్మ, పైడిలక్ష్మి పాల్గొన్నారు.

మెంటాడ : కుంటినవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శ్రీనివాస్



ఆండ్ర ప్రాజెక్టు ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు

తాగునీటి ఎద్దడి నివారణకు ఆండ్ర నీరు

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవికాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా మంగళవారం ఆండ్ర జలాశయం నుండి నీటిని విడుదల చేయించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆయన ఆదేశాలతో ఇఇ టి.రాయల్ బాబు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు ఆండ్ర ప్రాజెక్టు వద్దకు వెళ్లి, అక్కడ విడుదలవుతున్న నీటి ప్రక్రియను పరిశీలించారు. ఆండ్ర ప్రాజెక్టు గేట్ నెంబర్ 2 నుండి ఈ మేరకు నీటిని విడుదల చేశారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచనలతో ఇరిగేషన్ అధికారులతో సంప్రదింపులు జరిపి ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా నీటి విడుదలకు చొరవ చూపాలని కోరగా, అందుకు తగ్గ ఏర్పాట్లు చేపట్టారు. ఆండ్ర జలాశయం నుండి నేరుగా మర్రివలస, పిట్టాడ, మెంటాడ, గజపతినగరం, డోలపేట, జీవపేట మీదుగా మొత్తం 40 కిలోమీటర్లు ప్రవహించి నెల్లిమర్ల వద్దనున్న చంపావతి నది వాటర్ ప్రాజెక్ట్ వద్దకు చేరుతుంది. అక్కడ ఇన్ఫిల్ట్రేషన్ ఊటబావుల వద్ద నుండి నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ ద్వారా విజయనగరం నగరపాలక సంస్థకు నీటి పంపిణీ జరుగుతుందని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆండ్ర నుండి నెల్లిమర్ల వద్దకు నీరు చేరేందుకు సుమారు వారం రోజులు కాలవ్యవధి పడుతుందని తెలిపారు. వేసవిలో కూడా నగర ప్రజలకు యథావిధిగా మంచినీటి సరఫరా చేసేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని చంద్రబాబు కాలనీలోని సర్వే నెంబరు 60లో ఉన్న ప్రభుత్వ భూమిని కొంత మంది అక్రమార్కులు జెసిబితో చదును చేసి కబ్జా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న నగరపంచాయతీ సిబ్బంది మంగళవారం అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. స్థానిక వార్డు ప్రణాళిక కార్యదర్శి ఆ ప్రాంతానికి చేరుకుని జెసిబితో చేస్తున్న పనులను నిలుపుదల చేశారు. వెంటనే కమిషనర్‌కు ప్రణాళిక కార్యదర్శి సమాచారం ఇవ్వడంతో ఆయన కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జనసేన ఆవిర్భావ సభకు వెయ్యి మంది

డెంకాడ: ఈ నెల 14న పిఠాపురంలో జరిగే జనసేన 12వ ఆవిర్భావ సభకు మండలం నుంచి 1000 మంది వెళ్తున్నట్లు జనసేన మండల కన్వీనర్ పైల శంకర్ తెలిపారు. ముఖ్య నాయకులు కార్యకర్తలతో మండలంలోని బొడ్డవలసలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పైల శంకర్ మాట్లాడుతూ మండలంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా సుమారు 150 కార్లలో వెయ్యి మంది వరకు వెళుతున్నట్లు వెల్లడించారు. ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, జనసేన సీనియర్ నాయకుడు దిండి రామారావు, చింతపల్లి రామ్మూర్తి పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ఎమ్మెల్యే లోకం మాధవి నేతృత్వంలో మండలంలోని గంట్లాం గ్రామానికి చెందిన సర్పంచ్ మళ్లపురాజు బంగారమ్మ, సీనియర్ నాయకులు మళ్లపు రమణ రాజుతో పాటు మరో ఆరుగురు వార్డు మెంబర్లు, వైస్ సర్పంచ్ తమ అనుచరులతో కలిపి సుమారు 30 కుటుంబాలు వైసిపిని వీడి జనసేనలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆమె స్వయంగా కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

14న జనసేన సభ

విజయనగరం టౌన్ : ఈనెల 14 న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పార్టీ కార్యకర్తలు జెండాలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటిపైనా జెండా ఎగురవేయాలని అన్నారు. విజయనగరం నియోజకవర్గం నుండి 6 బస్సులు , 50 కార్లలో కార్యకర్తలంతా తరలివెళ్లనున్నట్లు తెలిపారు. పార్టీలో గ్రూపులు లేవని, కాకినాడలో సమావేశానికి హాజరైనందున విజయనగరంలో జరిగిన సన్నాహక సమావేశానికి హాజరు కాలేకపోయానని తెలిపారు.

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

నెల్లిమర్ల: అభ్యంతరం లేని ప్రభుత్వ భూములు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ పి.సుదర్శనరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిఒ నెంబర్ 30 మేరకు అభ్యంతరం లేని ప్రభుత్వ భూములు క్రమ బద్ధీకరణకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 2019 అక్టోబరు 15 ముందు ఇటువంటి భూములలో ఎవరైనా ఇల్లు కట్టుకొని ఉన్నవారికి వారి దగ్గర ఉన్న ఆధారాలతో గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవ కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి, విచారణ చేసి క్రమబద్ధీకరణ చేస్తామన్నారు.

సోషల్ ఆడిట్‌పై గ్రామసభ

వేపాడ: మండలంలోని సోంపురంలో 2024-2025కు సంబంధించిన ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం సోషల్ ఆడిట్ గ్రామ సభను నిర్వహించారు. ఇంతవరకు జరిగిన పనులు వివరాలు, వేతన దారులకు ఇచ్చిన పేమెంట్ వివరాలు, వర్క్‌లకు సంబంధించిన రికార్డులు గ్రామ సభలో వివరించారు. ఆరోపణలపై వచ్చిన వివరాలను కూడా నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎస్.లక్ష్మణరావు, జిల్లా రిసోర్స్ పర్సన్ ఎం.మధు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎపిఒ ఆదిలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ సర్పంచ్ గంగరాజు, ఎంపిటిసి, గ్రామ పెద్దలు, మేట్లు, వేతనదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

నెల్లిమర్ల: ప్లాస్టిక్ నిషేధంపై కెజిబివి విద్యార్థినులకు నగర పంచాయతీ అధికార్లు మంగళవారం అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమా భాస్కర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కింద ఉపయోగించు వస్తువులు, ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, బెలూన్లు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, పోర్కులు, చెంచాలు, కత్తులు, ట్రేలు, ఆహ్వాన పత్రాలు, 100 మైక్రాన్ల లోపు ఉండే పివిసి బ్యానర్లు, అలంకరణ కోసం వాడే థర్మాకోల్ వంటి వస్తువులు పర్యావరణానికి హాని కలిగిస్తాయని తెలిపారు. వాటిని వాడకుండా జ్యూట్ సంచులను మాత్రమే వాడే విధంగా మీరు తల్లి తండ్రులకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దుకోవాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో వార్డు శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నవోదయం 2.0పై అవగాహన

వేపాడ: మండలంలోని కృష్ణరాయుడుపేటలో కొత్తవలస ఎక్సైజ్ శాఖ, గ్రామ సర్పంచ్ చెలిపోని బాలబాబు ఆధ్వర్యంలో మద్యపాన నిషేధం, నవోదయం 2.0పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ సిఐ శ్రీనాధుడు మాట్లాడుతూ గ్రామంలో నాటు సారా తయారు చేసినా, ఇతర గ్రామాల నుంచి తెచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

స్వయం సంరక్షణతోనే అంగవైకల్యం నివారణ

మెంటాడ: స్వయం సంరక్షణతోనే అంగవైకల్యాన్ని నివారించ వచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉషారాణి చెప్పారు. లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో చల్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన డిపిఎంఆర్ శిబిరంలో ఆమె మాట్లాడారు. కుష్టు వ్యాధి, అంగవైకల్యం నివారణకు వ్యక్తిగత స్వీయ సంరక్షణ పాటించాలని చెప్పారు. స్పర్శలేని, మొద్దుబారిన పాదాలు కలిగిన వారు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా కుష్టు నిర్మూలన పారా మెడికల్ ఆఫీసర్ ఎల్ అప్పలస్వామి మాట్లాడుతూ స్పర్శలేని, నొప్పులేని మచ్చలు ఉంటే కుష్టువ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం సెల్ఫ్ కేర్ కిట్స్ అందించారు. లెప్రా సొసైటీ పిజియోథెరపిస్టు లావణ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్ లెంక రమణ, పిహెచ్‌సి సూపర్ వైజర్ ఉదయ్‌కుమార్, లెప్రా, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవా సంఘం కన్వీనర్‌గా ప్రసాద్ పట్నాయక్

విజయనగరం టౌన్ : జిల్లా గ్రంథాలయ సేవా సంఘం సంస్థ పట్టణ కన్వీనర్ గా- త్యాడ ప్రసాద్ పట్నాయక్‌ను, కో- కన్వీనర్ గా కంటిమహంతి మురహరి సంజీవరావును సంస్థ వ్యవస్థాపకులు- అబ్దుల్ రవూఫ్, గౌరవ అధ్యక్షులు నాలుగెస్సుల రాజు, అధ్యక్షులు - కొత్తలి ఏర్నాయుడు, ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ నియమించారు. ఈమేరకు వారికి నియామక పత్రాలు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.30వేలు సాయం

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామంలో కొత్తగా నిర్మింస్తున్న పైడితల్లి అమ్మవారి ఆలయానికి గూడెపువలస సర్పంచ్ మట్ట అయ్యప్ప రామకృష్ణారెడ్డి తన వంతు సహాయం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా లింగాలవలస గ్రామ పెద్దలకు ఆలయ నిర్మాణానికి రూ.30వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చెల్లుబోయిన రాము, కర్రోతు శ్రీనివాసరావు, కనకల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

రామభద్రపురం: రాయితీ రుణాలకు అర్హులైన కులాలవారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ రత్నం తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ రుణాలు మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ రుణాలకు బీసీ, ఈబీసీ, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు చెందిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. బ్యాంకు విల్లింగ్ ద్వారా బాక్ ఎండ్ సబ్సిడీతో యూనిట్ విలువ ఆధారంగా రుణాలు టార్గెట్ ప్రకారం పారదర్శకంగా మంజూరుకు సిఫార్సు చేస్తామన్నారు.

నాణ్యతతో అభివృద్ధి పనులు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించి, అభివృద్ధి , మరమ్మత్తు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయ భవనంపై వర్షాలు కారణంగా వచ్చే లీకేజీలను నియంత్రించేందుకు చేపట్టిన మరమ్మత్తు పనులను ఎస్‌పి పరిశీలించారు. వర్షపు నీరు స్లాబ్‌లోకి దిగి పోకుండా చేపట్టిన చర్యలను అధికారులను, టెక్నీషియన్స్‌ను అడిగి తెలుసుకున్నారు. మరమ్మత్తు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీసు కార్యాలయం లోగల వీడియో కాన్ఫరెన్సులో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అమర్చిన సిసి కెమెరాలను కమాండు కంట్రోల్‌కు అనుసంధానం చేయాలన్నారు. ఆయన వెంట అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, సిఐలు ఉన్నారు.

మద్యాన్ని నియంత్రించి ఆరోగ్యాలను కాపాడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకరరావు

ప్రజాశక్తి - బొబ్బిలి

మద్యాన్ని నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యాన్ని అందించి మద్యాన్ని నియంత్రిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. నాసిరకం మద్యాన్ని అమ్మడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడి ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైన్ షాపులను పెంచి ప్రధాన రహదారులు పక్కన పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారన్నారు. మద్యం షాపులు ప్రైవేట్ వ్యాపారులకు ఇవ్వడం వల్ల సిండికేట్‌గా మారి మద్యం ధరలు పెంచి గ్రామాల్లో బెల్ట్ షాపులకు విచ్చలవిడిగా మద్యాన్ని సరఫరా చేస్తున్నారని విమర్శించారు. మద్యాన్ని నియంత్రించాలని, నాణ్యమైన మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో సిపిఎం చేసిన ప్రజా చైతన్య యాత్రలో బెల్ట్ షాపులు, నాసిరకం మద్యం, మద్యం ధరలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. బెల్ట్ షాపులను పూర్తిగా నియంత్రించకపోతే ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు యుగంధర్, శంకర్, గోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకరరావు

పంచాయతీ కార్యదర్శుల సంఘం జోనల్ సెక్రటరీగా ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - రామభద్రపురం

ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం జోనల్ సెక్రటరీగా మండలంలోని కొట్టక్కి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆకుల ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. దీనిలో ప్రవీణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడంలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో గ్రామ కార్యదర్శులపై అదనపు భారాలు విధించి ఇబ్బందులు పెడుతున్నారని వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. కార్యదర్శులకు పదోన్నతుల విషయంలో కూడా అన్యాయం జరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం ఇతను సాలూరు తాలుకా యూనిట్ ఎన్జీవో ప్రెసిడెంట్‌గా కూడా పనిచేస్తున్నారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జిల్లా కోఆర్డినేటర్ రూపావతి

ప్రజాశక్తి - వేపాడ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ వసతి గృహాల జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపావతి అన్నారు. మండలంలోని బక్కునాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ సందర్శించారు. ఈ నెల 17వ తేదీ నుండి జరుగునున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం ఎలా చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ విద్యార్థులు పరీక్షలు ఎలా రాశారని ఆరా తీశారు. ఇంటర్ విద్యార్థులతో పాటు పదో తరగతి విద్యార్థులు కూడా శతశాతం ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం మెస్‌కు వెళ్లి భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల అకాడమిక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. పరీక్షా సమయంలో పిల్లలకు రాత్రి పూట పాలు, బిస్కెట్లు, పళ్లు ఎక్కువగా ఇవ్వాలని ప్రిన్సిపల్ ఉషారాణికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సూచనలు చేస్తున్న రూపావతి

నేడు 'యువత పోరుబాట'

ప్రజాశక్తి - వేపాడ

జిల్లా కేంద్రంలో బుధవారం చేపట్టనున్న యువత పోరుబాటను విద్యార్థులు, యువకులు, వైసిపి నాయకులు విజయవంతం చేయాలని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు ఆధ్వర్యంలో ఎంపిపి సత్యవంతుడు, మాజీ డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినరామనాయుడు చేతులు మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం యువతను మోసం చేసిందని ఈ నేపథ్యంలో చేపడుతున్న ర్యాలీకి పెద్ద ఎత్తున యువకులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఈశ్వరరావు, వేపాడ సర్పంచ్ ఎం అర్జునమ్మ, ఎం రమణ పాల్గొన్నారు.

జామి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలల కాలంలో యువతని మోసం చేసిందని రాష్ట్రంలో యువకులకు సమాధానం చెప్పాలని వైసిపి మండల కన్వీనర్ రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే జామిలోని తన నివాసంలో యువత పోరు పోస్టర్ విడుదల చేశారు. ఈ నెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భారీ ఆందోళనకు దిగుతున్నామని యువత పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పి.సంజీవురావు, ఎంపిపి అరుణ, జామి మాజీ సర్పంచ్ నెక్కలి రమణ, వాక అప్పారావు, చింతాడ సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బొండపల్లి: వైసిపి జాతీయ అధ్యక్షులు వైస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు విజయనగరం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరును జయప్రదం చేయాలని ఎంపిపి చల్ల చలం నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు కోరారు. స్థానిక వనమిత్ర వద్ద మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ యువత ఆశలను కూటమి ప్రభుత్వం నెరవేర్చడం లో విఫలమైందని చెప్పారు అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముద్దూరు సర్పంచ్ మునకాల పైడిపునాయుడు, మండల గృహసారదుల కన్వీనర్ పల్లి రఘు, జిల్లా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ తొత్తడి సత్తిబాబు, ఎంపిటిసి బండారు శ్రీనువాస రావు, ఉప సర్పంచ్ కోల వెంకటరమణ, సీనియర్ పార్టీ నాయకులు మీసాల తులసీరావు, పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతరలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి, భోగాపురం అమ్మవారి జాతర సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పోలిపల్లి గ్రామంలోని పైడితల్లి అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు క్యూ లైన్‌లో వేచి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో పాలధారను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో రథాలను అంగరంగ వైభవంగా ఊరేగించారు. భోగాపురం గ్రామంలోని కనకదుర్గమ్మ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం భక్తులు ఘటాలతో భారీ ఊరేగింపుతో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిఐ ఎన్ వి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు పాపారావు, సూర్య కుమారి, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భోగాపురం: విద్యుత్తు కాంతుల నడుమ కనకదుర్గమ్మ ఆలయం

ఘనంగా చిన్నమ్మతల్లి సంబరాలు

రామభద్రపురం: మండల కేంద్రంలో వెలసిన చిన్నమ్మతల్లి పండగ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జాము నుంచే భక్తులు క్యూ కట్టి ఘటాలకు మొక్కులు చెల్లించారు. నిర్ణీత సమయానికి ఘటాల తిరువీధి మహోత్సవాన్ని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు మధ్య అంగరంగవైభవంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు వేలాదిగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

రామభద్రపురం: ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

వివిధ ధార్మిక సంఘ సభ్యులు క్యూలైన్లో ఉన్న భక్తులకు మజ్జిగ, మంచినీరు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు ఆధ్వర్యంలో ఎస్ఐ వెలమల ప్రసాదరావు, పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు.

నిరసన పిలుపు హాస్యాస్పదం : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఫీజు రియంబర్స్‌మెంట్ విషయంలో వైసిపి నాయకులు నిరసనకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి చీమల సంతోష్ కుమార్, పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బెవర భరత్ అన్నారు. మంగళవారం అశోక్‌బంగ్లాలో వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 12న వైసిపి చేపట్టిన యువతపోరు కార్యక్రమం పోస్టర్‌ను దొంగల ముఠా అంతా కలిసి విడుదల చేశారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంటు, వసతి దీవెన సకాలంలో చెల్లించని జగన్, ఇప్పుడు నిరసనకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఐదేళ్లలో గుర్తుకు రాని రీయింబర్స్‌మెంటు, వసతి దీవెన జగన్‌కు ప్రతిపక్షంలో ఉండగా గుర్తొచ్చిందా? అని ప్రశ్నించారు. ఇటువంటి చౌకబారు నిరసనలను ప్రజలు నమ్మరని ఈ కార్యక్రమానికి యువత హాజరు కారని చెప్పారు.

నిరంతరం సేఫ్టీ పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

కంపెనీలో పనిచేసిన కార్మికులు నిరంతరం సేఫ్టీ పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని విశాఖపట్నం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ తెలిపారు. శారదా కంపెనీలో మంగళవారం 54వ జాతీయ సేఫ్టీ వీకెండ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులకు సేఫ్టీ మెథడ్స్ గురించి వివరించారు. మనిషి జీవితంలో ఎన్ని పనులైనా చేయవచ్చని, కానీ సేఫ్టీ సెక్యూరిటీ పాటించి పనులు చేయాలని తెలిపారు. మీ జీవితాలు అంధకారం కాకూడదని, సంతోషంగా విలాసవంతంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. పరిశ్రమలో పనిచేసిన కార్మికులు, ఉద్యోగులు అనేక రకాలైన ఒడిదుడికల మధ్య జీవిస్తున్నారని అన్నారు. ఎన్ని ఒడిదుడుకులు మధ్య జీవించిన మనసు ప్రశాంతతతో మెలగాలని, అప్పుడే జీవితం సుఖాంతం అవుతుందని అన్నారు. కర్మాగా రంలో పనిచేసిన ప్రతి కార్మికునికి సేఫ్టీ సెక్యూరిటీ పైన అత్యుత్తమమైన శిక్షణ ఇచ్చారు. అనంతరం కార్మికులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సనత్‌కుమార్ దాస్, సీనియర్ జిమ్ ఎంఎం అనంత్ కుమార్, సీనియర్ జిమ్ సివిల్ విజయ్ భాస్కర్, ఇహెచ్ఎస్ డిజిఎం సూర్య భాస్కర్, హెచ్ఆర్ డిజిఎం సన్యాసి రావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఆర్థిక బకాయిల చెల్లింపుపై చర్చించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలపై చర్చించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సెల్లర్ జె సి రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెసి రాజు మాట్లాడారు. గత ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా ఉద్యోగ ఉపాధ్యాయులను మభ్యపెట్టి బకాయిలు చెల్లించకుండా మోసం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సమస్యల పరిష్కారం, బాకాయిల చెల్లింపులపై చర్యలు తీసుకుంటుదని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతగానో ఎదురు చూస్తున్నారని, నేటికి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో తీవ్ర నిరాశతో, ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని అన్నారు. టిడిపి కూటమి పభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఏ ఒక్క క్యాబినెట్ సమావేశంలో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను కనీసం చర్చించలేదన్నారు. 12వ వేతన సంఘాన్ని నియమించటం మధ్యంతర భృతి ప్రకటన చేయటంపై క్యాబినెట్‌లో చర్చించి 27 శాతాన్ని ఐఆర్‌గా ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు, సీనియర్ కార్యకర్త నాగేశ్వర రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజు

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కెజిబివి విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి. ఉమా మంగళవారం తెలిపారు. ఈ నెల 15,16న తేదిలలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ జూడో పోటీలకు జిల్లా నుంచి మహిళల విభాగంలో కెజిబివి పాఠశాలకు చెందిన జె. కావ్య, పి.పావని, పి.జ్యోత్స్న రాణి, ఎస్. డిల్లిశ్వరి, కె.భార్గవి, బి.దీపిక, సత్య, అనూష, జయలక్ష్మి ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్‌తో పాటు పిఇటి రమణి అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పిఇటి రమణి

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మోహనరావు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన మద్దిల మోహనరావు ఎంపికైనట్లు పిఇటి ఎన్.సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు కడప జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల ఛాంపియన్ షిప్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్ఎం ఆర్. ఆదినారాయణ, సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఎమ్మెల్యే ప్రస్తావించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో ఉన్న వందేళ్ళ చరిత్ర కలిగిన సిబిఎం గర్ల్స్ స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్, గుర్తింపు రెన్యువల్ విషయంలో ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే బేబీ నాయన ప్రస్తావన చేయాలని సిబిఎం స్కూల్ పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం సిబిఎం స్కూల్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చెవిలో బంతిపూలు పెట్టుకుని వినూత్నంగా స్కూల్ గేటు ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మినాయుడు మాట్లాడుతూ స్కూల్ కరస్పాండెంట్ రత్నకుమార్ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి స్కూల్ గుర్తింపుతో సక్రమంగా నడుస్తున్న టైంలో కారు చౌకగా అమ్మేశారన్నారు. ఇది ముమ్మాటికీ దుర్మార్గమని, దీనిపై ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటాలకు స్పందించి బేబీనాయన అసెంబ్లీలో ప్రస్తావించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి.రవికుమార్, సిపిఐ పట్టణ నాయకులు పాలూరి కృష్ణ, ఎఐఎస్ఎఫ్ బొబ్బిలి డివిజన్ నాయకులు ఎం.శ్రీహరి, ఎఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని కొటారుబిల్లి జంక్షన్‌లో నివాసముంటున్న జగదీష్(24) అదే జంక్షన్‌లోని మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జగదీష్ సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం జగదీష్ మృతదేహం ఇంటికి సమీపంలోని తోటలో చెట్టుకు వేలాడుతూ కనిపించడాన్ని కొంత మంది చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని అక్కడ ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారులో తరలిస్తున్న గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేస్తుండగా అరకు నుండి ఎస్ కోట వైపు వస్తున్న టాటా ఇండికా కారులో సుమారు 50 కేజీల వరకు గంజాయి పట్టుబడింది. ఈ కేసు విషయమై నిందితుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సిఐ వి.నారాయణమూర్తిని వివరణ కోరగా పూర్తి దర్యాప్తు చేసి బుధవారం నిందితుల వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

గణాంక వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సచివాలయాలకు ముఖ్యమైన గణాంక వ్యవహారాలలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఎడ్యుకేషన్, ఎమినిటీస్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాష్ బుక్‌ల నిర్వహణ, అకౌంట్స్ వ్యవహారాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని చెప్పారు. పొరపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎడ్యుకేషన్ కార్యదర్శులు సమీకరించిన నిధులను ఎప్పటికప్పుడు నగరపాలక సంస్థకు జమయ్యేలా చూసుకోవాలన్నారు. కుళాయి ఛార్జీలు వసూలు చేస్తున్న ఎమినిటీస్ కార్యదర్శులు ఎప్పటికప్పుడు వసూలైన మొత్తాలను నగరపాలక సంస్థకు జమ చేసే విధంగా చూడాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని అన్నారు. సమావేశంలో అకౌంటెంట్ నరసింహరాజు, జెఎఒ కిరణ్ కుమార్ పాల్గొన్నారు

గ్రామ పంచాయతీ కార్యాలయం - మోదవలస

టెండర్ ప్రకటన

విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, మోదవలస గ్రామ పంచాయతీ పరిధిలో ఈ దిగువ తెలిపిన విధులు నిర్వర్తించుటకుగాను సం॥ 2025-26 నకు టెండరు ద్వారా గౌరవ సర్పంచ్ గారి అధ్యక్షతన తే 12-2-2025 ది మధ్యాహ్నం గం॥ 3.00ల వరకు ధరఖాస్తులు స్వీకరించబడును. ఈటెండరు పద్దతిలో తక్కువ మొత్తంనకు వేసేవారిని హక్కుదారులుగా సూచించెదరు. షరతులు మరియు ఇతర వివరాల కొరకు కార్యాలయం పని చేయు వేళల్లో స్వయంగా వచ్చి అడిగి తెలుసుకోవలెను. ఏ కారణం చేతనైనా టెండరు వేయుటకు, రద్దు చేయుటకు ఈ దిగువ సంతకం చేసే వారికి పూర్తి అధికారం కలదు. టెండరు అమలులో ప్రస్తుత ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి జరపబడును.

షెడ్యూల్

తే 12-2-2025ది బుధవారం మధ్యాహ్నం గం॥ 3.30ల నుండి 4.30 ని॥ వరకు టెండరువార్ల సమక్షంలో టెండర్లు తెరవబడును.

వ.నెం.	టెండరు వివరం	సంఖ్య	సం॥	చెల్లించబడు సొమ్ము
1	పారిశుధ్య కార్మికులు	02	2025-26	12,000/-
2	పంపు ఆపరేటర్	01	- do -	10,000/-
3	విద్యుత్ సహాయకుడు	01	- do -	10,000/-
4	పారిశుధ్య బండి (ఆటో) డ్రైవర్	01	- do -	15,000/-

×××××
సర్పంచ్
మోదవలస

××××
పంచాయతీ కార్యదర్శి
మోదవలస

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P. 2 of 2025

Between :
గుడ్ల రామకృష్ణరావు ....పిటిషనరు
And:
NIL ......రెస్పాండెంటు

యిందు మూలముగా యావన్మందిగా తెలియచేయునది ఏమనగా కాలము చేసిన గుడ్ల సుబ్రహ్మణం గారు తీసుకున్న SBI Life Insurance Policy నెంబరు INO 19230303 తాలుకా రావలసిన మొత్తమునకు Succession Certificate యిందలి పిటిషనరుకు యిప్పించమని కోరుచూ పై నెంబరు పిటిషను దాఖలు చేసియున్నారు. అందులకు ఎవరికైనా ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టువారి ఎదుట **తే 21-3-2025దీ ఉదయం 10-30 గంటల**కు స్వయంగా కాని వకీలు ద్వారా గాని హాజరు కావలసినదిగా యిందుమూలముగా తెలియచేయడమైనది.

N.K.Raj Kumar
Advocate for Petitioner,
Vizianagaram
Cell: 9440570108